క్లుప్తంగా

ఇంటింటికీ రామయ్య అక్షింతలు



అక్షింతలకు పూజలు చేస్తున్న దృశ్యం

టేకులపల్లి: అయోధ్య రాముల వారి అక్షింతలు గడప గడపకూ అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ప్రతినిధులు శుక్రవారం టేకులపల్లికి అక్షింతలు తీసుకువచ్చారు. వీటికి మండల కేంద్రంలోని భవానీ శంకర వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని 36 గ్రామ పంచాయతీలకు సేవక్‌ల ద్వారా అక్షింతలను పంపించారు.

రోశయ్య చౌదరికి అవార్డు ప్రదానం

పాల్వంచ: ఈ నెల 18వ తేదీ నుంచి 22 వరకు తిరుపతిలో జరిగిన సుబ్బరాజు నాట్య కళా పరిషత్ కార్యక్రమంలో పాల్వంచకు చెందిన పాకాలపాటి రోశయ్య చౌదరి ఎన్టీఆర్ పురస్కారం, అశ్వం అవార్డు, సన్మానం అందుకున్నారు. సాంఘిక పౌరాణిక నాటక పోటీల్లో చౌదరి నటనకు ఈ అవార్డు లభించింది. అదేవిధంగా 16, 17 తేదీల్లో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ప్రపంచ తెలుగు కళా ఉత్సవాల్లో నటవైభవ సామ్రాట్ బిరుదు లభించింది.

గ్రామాభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులు

పాల్వంచ: పట్టణంలోని శేఖరం బంజర గ్రామాభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా బానోతు బాలు నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా శంకర్ నాయక్, నూనావత్ సురేశ్ నాయక్, ఉపాధ్యక్షులుగా బాదావత్ సామా నాయక్, ఇస్లావత్ శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు బాలు నాయక్, బోడా శేఖర్ నాయక్, జాయింట్ సెక్రటరీలు గుగులోతు రాజు నాయక్, గుగులోతు రవినాయక్, ప్రచార కార్యదర్శిగా భూక్యా నాను నాయక్, భూక్యా లాలు నాయక్, ఇస్లావత్ పవన్‌కుమార్ నాయక్, కార్యవర్గసభ్యులు, గౌరవ సలహాదారులు ప్రమాణం చేశారు.

క్రీస్తు బోధనలు మార్గదర్శకం



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కొత్వాల

పాల్వంచ: యేసుక్రీస్తు బోధనలు అందరికీ మార్గదర్శకం అని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగులో లివింగ్ జీసస్ చర్చిలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాల్గొన్న కొత్వాల కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర క్యాలండర్లను ఆవిష్కరించారు. పాస్టర్ జాన్‌వెస్లీ, ఎల్‌సీఐ ప్రెసిడెంట్ జేసుదాసు, అనిల్, ప్రభుదాస్, మురళీ, వినోద్, శాంతివర్ధన్, కొండలరావు, వీరు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఊతమిస్తే ముందుకు 'సాగు'తాం!

- అన్నదాతలకు చేయూత అవసరం
- వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపన తప్పనిసరి
- తద్వారా రైతుల బలోపేతానికి అవకాశం
- నేడు అంతర్జాతీయ రైతు దినోత్సవం



దుక్కి దున్నుతున్న రైతులు (ఫైల్)

ఇల్లెందురూరల్: అందరికీ అన్నం పెట్టే అన్నదాత సుభిక్షంగా ఉంటేనే ఆహార భద్రత సాధ్యమవుతుంది. కానీ, మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఇతర సంక్షోభాలతో ప్రస్తుతం రైతులు అవస్థ పడుతున్నారు. వ్యవసాయ ఉత్పాదకాలు, ఉత్పత్తులు విక్రయించే వ్యాపారులు ఆర్థికంగా బలపడుతున్నందున దేశానికి వెన్నెముకగా అభివర్ణించే అన్నదాతను ఆదుకోవాల్సిన అవసరముంది. వ్యవసాయం నానాటికీ సంక్షోభంలో కూరుకుపోవడానికి కారణం ఏమిటి.. సాగుకు దూరమవుతున్న యువతను ఆకర్షించడానికి చేయాల్సిన తక్షణ కర్తవ్యం ఏమిటి.. తదితర అంశాలపై నేడు (శనివారం) అంతర్జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా కథనం.

మార్పులు అవసరం..

రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు స్థాపించి యువత, మహిళలను భాగస్వామ్యం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో తయారైన ఉత్పత్తులు పట్టణాల్లో విక్రయించేలా చూడాలి. గ్రీన్ హౌజ్‌లో కూరగాయల పెంపకం, వ్యవసాయ ఉత్పత్తులతో ఉప ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

చేరువకాని సంస్కరణ ఫలాలు..

ఆరుగాలం కష్టించే రైతన్న దోపిడీకి గురికాకుండా ప్రభుత్వ విధానాలు మారాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం సంస్కరణ ఫలాలు రైతుకు మేలు చేసేలా ఉండాలని చెబుతున్నారు. కచ్చితమైన వ్యవసాయ విధానం ఏ ప్రభుత్వానికి లేకపోవడం, లోపభూయిష్టమైన నిర్ణయాలతో లాభం ఉండదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

రైతులకు మేలుకొలుపు...

ఆధునిక వ్యవసాయ విధానంలో భాగంగా విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. అలాకాకుండా సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి భూసారాన్ని పరిరక్షించడంతో పాటు మిత్ర పురుగులను కాపాడుకోవాలి. స్వయం సమృద్ధిని సాధించడానికి వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి. వ్యవసాయానికి దూరమవుతున్న యువత విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించేలా చూడాలి.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగుచేసి ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా సిద్ధం చేయాలి. ఇందుకోసం వాతావరణ శాఖను కీలకం చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

గిట్టుబాటు ధరలతోనే ఊరట...

జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఏటా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయే తప్ప గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ క్రమంలో రైతులపై అప్పుల భారం పెరుగుతోంది. జిల్లాలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులతోపాటు కౌలు దారులు ఉన్నందున పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుని ప్రత్యామ్నాయ విధానాలపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలి. దీనికి తోడు పంట పండిస్తే గిట్టుబాటు ధర దక్కుతుందన్న నమ్మకం కల్పించాలి.

వనరులు బలహీనం...

పంటల సాగుకు ప్రధాన అవసరం నీరు. జిల్లాలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్నా వాటిని భూముల దరికి చేర్చడంలో పాలకులు విఫలమవుతున్నారు. గతంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ జరిగినా పంట కాల్వలను విస్మరించారు. దీంతో చెరువులు నిండుగా ఉన్నా చివరి తడికి నీరందక పంటలు ఎండిపోవడం సర్వసాధారణమైంది. ప్రస్తుత ఏడాది కూడా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. చెరువుల్లో నీరున్నా కాల్వల దుస్థితి కారణంగా వరి తదితర పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో చెరువులు, పంట కాల్వలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తిస్తే అన్నదాతలకు మేలు జరుగుతుంది.

రైతులకు భద్రత కల్పించాలి



దేశానికి ఆహార భద్రత కావాలంటే రైతుకు భద్రత కల్పించాలి. వ్యవసాయ పరిశోధన ఫలితాలు రైతుల చెంతకు చేరాలి. ధాన్యం నిల్వలకు గోదాములు, సోలార్ విద్యుత్ అందుబాటులోకి తీసుకురావాలి. మార్కెటింగ్ విధానంలోనూ మార్పులు రావాల్సి ఉంది.

–మంచె రమేశ్, రైతు, కొమరారం

ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యం



ఉత్పాదకాలు, ఉపకరణాలన్నీ ప్రభుత్వమే రాయితీతో పంపిణీ చేయాలి. సాగులో శాస్త్రీయ విధానం కొనసాగేలా చూడాలి. మార్కెట్ పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోకి రావాలి. యువత వ్యవసాయం వైపు వచ్చేలా సాగు విధానాల్లో సంస్కరణలు తీసుకురావాలి.

–మోకాళ్ల కృష్ణ, రైతు, మాణిక్యారం

అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం



సుజాతనగర్: పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



టేకులపల్లి: తావుర్యాతండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సుజాతనగర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ ఏపీడీ రవి అన్నారు. వికాసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా లక్ష్మీదేవిపల్లి, కోమటపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీలో ఆయా శాఖల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జనవరి 26 వరకు ఈ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు.

ఉపాధి హామీ, విశ్వకర్మ యోజన, జన్‌ధన్ యోజన, పీఎం కిసాన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కాగా అధికారులు లక్ష్మీదేవిపల్లిలో అవగాహన కల్పిస్తున్న సమయంలో కొంతసేపు కార్యకమంలో గందరగోళం చోటుచేసుకుంది. అధికారులు పథకాల గురించి వివరిస్తుండగా తమకు పథకాలు అందలేదని గ్రామస్తులు అడ్డు తగిలారు. రేషన్‌కార్డులు లేవని, ఉపాధి బిల్లులు చెల్లించలేదని, మరుగుదొడ్లు మంజూరు కాలేదని పలు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రాజకీయ నాయకులు, అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అధికారులు కార్యక్రమాన్ని ముగించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శిరీష, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏఓ నర్మద, వైద్యాధికారి రమేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు తలపెట్టిన వికసిత భారత సంకల్ప యాత్ర వాహనం శుక్రవారం మండలంలోని తావుర్యా తండా, తడికలపూడి గ్రామాలలో పర్యటించింది. వివిధ సంక్షేమ పథకాలపై ఆయా శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా, బ్యాంకు రుణాలు, పంటలపై రుణాలు, మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ, ఆరోగ్యం, విద్య, వైద్యం తదితర కార్యక్రమాలపై డిజిటల్ స్క్రీన్‌పై వీడియో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస రామారావ్, ఎంపీఓ వీరబాబు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రామిరెడ్డి, ఏపీఎం రవికుమార్, మెడికల్ ఆఫీసర్ దినేష్ పాల్గొన్నారు.

పదవులు లేకున్నా.. పోరాటం చేస్తాం..



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఎటువంటి పదవులు లేకున్నా.. కార్మికుల సమస్యలపై బీఎంఎస్ పోరాడుతుందని ఆ సంఘం జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ అన్నారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థలోని బదిలీ వర్కర్ డిజిగ్నేషన్‌ను రద్దు చేయిస్తామని, అన్ని డిజిగ్నేషన్లకు క్యాడర్ స్కీమ్ అమలు చేయిస్తామని, కోలిండియాలో బదిలీ వర్కర్ డిజిగ్నేషన్లు రద్దు చేసి రెండు దశాబ్దాలు గడుస్తున్నా సింగరేణిలో దాన్ని కొనసాగించటం శోచనీయమన్నారు. బీఎంఎస్ గుర్తింపు సంఘంగా ఎన్నికైన వెంటనే బదిలీ వర్కర్ డిజిగ్నేషన్‌ను రద్దు చేస్తామన్నారు. ఈనెల 27న సింగరేణిలో జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాగడా గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పవన్ కుమార్, కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, టి.నరేంద్ర బాబు, ఊట్ల గణేష్, భూపతి అప్పారావు, సంగం చందర్, నాగేశ్వరరావు, బి.రాంసింగ్, రాజమౌళి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డే సందర్భంగా సెలవు ప్రకటించాలి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆవిర్భావ దినోత్సవమైన ఈనెల 23న కార్మికులకు సెలవు ఇప్పించాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు తదితరులు హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రిని కలిసి మాట్లాడారు.

తెలంగాణ ఏర్పడి పదేళ్లయినా కార్మికుల కోరిక నెరవేరలేదని, ఇకనైనా ముఖ్యమంత్రితో చర్చించి సెలవు ఇప్పించడంతో పాటు సొంతింటి పథకం అమలుకు శ్రీకారం చుట్టాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బందెల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా సీసీ రోడ్డు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మండల కేంద్రంలోని శ్రీసీతారామాలయం వెనక వీధిలో నాణ్యతాలోపంగా సీసీ రోడ్డు నిర్మించారు. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా సీసీ రోడ్డు నిర్మించారు. రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు మరుసటి రోజు ఉదయానికే పగుళ్లు రావడంతోపాటు, పెచ్చులు లేచి అస్తవ్యస్తంగా తయారైంది. గమనించిన స్థానికులు కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దెబ్బతిన్న రోడ్డుకు కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపించారు. నాసిరకంగా పనులు చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

ఘనంగా ఇరుముడి

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయంలో గురుస్వాములు పెద్దమళ్ల చందర్‌రావు, కోలా నరసింహారావుల ఆధ్వర్యంలో శుక్రవారం 50 మంది అయ్యప్పస్వాముల ఇరుముడి నిర్వహించారు. శ్రీసీతారామాలయంలో గురుస్వామి భద్రయ్య ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

'మహాలక్ష్మి'ని సవరించండి..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహాలక్ష్మి పథకాన్ని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న మహిళలకు మాత్రమే వర్తింపజేయాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే అవకాశం ఇవ్వాలి తప్ప, ఉద్యోగస్తులకు కూడా ఇవ్వడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న పురుషులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి నెలకు రూ.3000 ఆర్థిక సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రవ్వ భద్రమ్మ, కొప్పుల జీవన్, కొప్పుల వెంకట్ మహారాజ్, నరేష్ మహారాజ్, అనిల్, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయండి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలను వెంటనే విడుదల చేయాలని జిల్లా మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 204 మైనార్టీ గురుకుల పాఠశాలు, కళాశాలల్లో పని చేస్తున్న 7,570 మంది బోధన, బోధనేతర సిబ్బందితో పాటు గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగులు వేతనాలకు నోచుకోలేదని తెలిపారు. క్రిస్మస్ పండుగకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు.

గోకులంలో మజ్జిగ చిలికిన భక్తులు



రామాలయంలో సంధ్యా గొబ్బెమ్మలో పాల్గొన్న మహిళలు

పాల్వంచ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శాస్త్రి రోడ్‌లోని శ్రీ సీతారామ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా ఆలయ ఆవరణంలో సంధ్యా గొబ్బెమ్మ కార్యక్రమం ఎంతో వైభవంగా జరిపారు. ఆలయ ఈఓ రజినీకుమార్, వేదపండితులు గోపాలచార్యులు సమక్షంలో మహిళా భక్తులు గోకులంలో మజ్జిగ చిలికించి వెన్న తీసిన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త చలవాది ప్రకాశ్, పెండ్యాల రోజాలక్ష్మి, ధనలక్ష్మి, మౌనిక, నిర్మల, రాజ్యలక్ష్మి, ప్రసూన, స్వప్న, లక్ష్మి, సునీత, శ్యామల, సులోచన, సుజాత, కల్యాణి, విజయ, హారిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఇల్లెందు: మైనార్టీ గురుకులంలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రామానుజన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ పాఠశాలలో క్విజ్ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



టేకులపల్లి: ఏకలవ్య పాఠశాలలో..



కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పాల్వంచ: కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో..



జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో



కాకర్ల హైస్కూల్‌లో...

ఎంపీల సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం



సింగరేణి(కొత్తగూడెం): బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు



పాల్వంచ: అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న పలు పార్టీ నాయకులు



ఇల్లెందు: ఆందోళన చెస్తున్న కాంగ్రెస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పార్లమెంట్‌లో 146 మంది ఎంపీలను మూకుమ్మడిగా సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమే కాక బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ప్రజాపంథా ఆధ్వర్యాన కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఐ, ప్రజాపంథా జిల్లా కార్యదర్శులు ఎస్‌కే.సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, కెచ్చెల రంగయ్య, కాంగ్రెస్ నాయకులు ఆంతోటిపాల్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాల్వంచ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతోందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పార్లమెంట్‌లో 146 మంది ఎన్‌డీఏ కూటమి ఎంపీలను అప్రజాస్వామ్యంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడారు. కార్యక్రమలో యర్రంశెట్టి ముత్తయ్య, నదానాయక్, ఎస్ఎ.జలీల్, కనగాల అనంతరాములు, వివి రత్నాకర్, ముత్యాల విశ్వనాథం, పూర్ణచందర్‌రావు, కొండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: పార్లమెంటులో భద్రతా వైఫల్యాలపై ప్రభుత్వం వివరణ కోరినందుకు ఎంపీలను సస్పెన్షన్ చేయటం దారుణమని కాంగ్రెస్ ఆరోపించింది. శుక్రవారం ఇల్లెందులో కాంగ్రెస్ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో జగదాంబా సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. చీమల నాగరత్నమ్మ, యదళ్లపల్లి అనసూర్య, దొడ్డా డానియేల్, పులి సైదులు, వారా రవి, నవీన్ పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: పార్లమెంట్‌పై దాడి ఘటనలో సభలో చర్చించాలని అడిగినందుకు బీజేపీ ప్రభుత్వం ఇండియా కూటమి ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. దేశచరిత్రలో కనీవినీ ఎరగని విధంగా ఎంపీలను సస్పెండ్ చేయడం దుర్మార్గమని, నియంతృత్వంతో మోదీ పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, జరీనా, లక్ష్మణ్, ఎండీ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.